సాక్షి
వికారాబాద్
గురువారం, 20, మార్చి, 2025



వరద కాలువ మాయం

కాలువలు దండుకోవడమే ధ్యేయంగా ఎంచుకున్న అక్రమార్కులు జల వనరులను సైతం వదలడం లేదు. 12లో▸



బియ్యం పట్టివేత

జిల్లాలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్థానిక పోలీసులు జరిపిన దాడుల్లో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. 12లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం సా. 6.33 గం.	శుక్రవారం ఉ. 4.58 గం.

న్యూస్‌రీల్

సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి శీతల్



పరిగి సబ్‌జైలును పరిశీలిస్తున్న శీతల్

పరిగి: ఒక్కసారి జైలు జీవితం గడిపిన వారు మళ్లీ జైలుకు రాకుండా సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ జడ్జి శీతల్ అన్నారు. బుధవారం పరిగి సబ్ జైలును సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఖైదీలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కొంత మంది అనుకోని సంఘటనల వల్ల జైలుకు వస్తారని, మరి కొంత మంది క్షణికావేశంలో చేసిన తప్పులకు ఇక్కడికి వస్తారని తెలిపారు. జైలు జీవితం గడపం అంటే మంచి ప్రవర్తన గల వ్యక్తిగా మారడం అని అన్నారు. బెయిల్ పిటీషన్ వేసుకోలేని వారు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ఖైదీలకు న్యాయం చేయాలని న్యాయవాదులకు సూచించారు. అనంతరం బాలసదనంను సందర్శించి చిన్నారుల బాగోగులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, న్యాయవాదులు వెంకటేష్, శ్రీనివాస్, గౌస్‌పాష తదితరులు పాల్గొన్నారు.

మామిడి సాగులో జాగ్రత్తలు పాటించాలి

హార్టికల్చర్ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి కమల



మామిడి పంటను పరిశీలిస్తున్న కమల

అనంతగిరి: ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మామిడి సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని హార్టికల్చర్ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి కమల సూచించారు. బుధవారం వికారాబాద్ మండలంలో మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మామిడి తోటలకు డ్రిప్ విధానంతో ఒక్కో చెట్టుకు రోజుకు 3 గంటల పాటు నీరు పెట్టాలని తెలిపారు. ఉదయం గంటన్నర, సాయంత్రం గంటన్నర పాటు నీరు పడితే మట్టిలో తేమశాతం నిలకడగా ఉండి చెట్లు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. డ్రిప్ పరకరాలను చెట్టు కాండానికి 1.5 మీటర్ల దూరంలో అమర్చాలని సూచించారు. పది సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న చెట్లకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించటం వలన మామిడి కాయలు బాగా వస్తాయని తెలిపారు. ఫిప్రోనేల్ 2ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల తామర పురుగు బెడద నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. తేనె మంచు పురుగు నివారణకు బుప్రొఫెజిన్ 1.5 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి పిందె నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ప్లానోఫిక్స్ ఒక మిల్లీ లీటరును 4.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల కాత రాలడాన్ని నివారించవచ్చని తెలిపారు.

బిల్లు ఆమోదం బీసీల విజయం

- బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



సీఎం రేవంత్‌రెడ్డితో శ్రీనివాస్ గౌడ్

బషీరాబాద్: విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించడంపై బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగి శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని ప్రతి బీసీ బిడ్డ విజయమన్నారు. బుధవారం అసెంబ్లీ హాలులో బీసీ యువజన నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చట్టం చేశారని అన్నారు. బిల్లు ఆమోదానికి కృషి చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు.

నిరాశే!



రాష్ట్ర బడ్జెట్‌లో సీఎం సొంత జిల్లాకు మొండిచేయి

- కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై సానుకూల ప్రకటన
- ఊసేలేని అనంతగిరి పర్యాటకం
- కోట్‌పల్లి ప్రాజెక్టుకు రిక్తహస్తం
- పాలమూరు ఎత్తిపోతల ప్రస్తావనే లేదు

వికారాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం ఈ ప్రాంత ప్రజలను నిరాశ పరిచింది. అనంతగిరి పర్యాటక అభివృద్ధికి.. కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణ పనులకు నిధులు కేటాయించలేదు. జిల్లా సాగునీటి వరప్రదాయినిగా భావించే పాలమూరు ఎత్తిపోతల పథకం ఊసే లేదు. గత బడ్జెట్ సమావేశాల్లో ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేస్తామన్న సీఎం ప్రస్తుత బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే తేలేదు. జిల్లాలోని జుంటుపల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి తదితర ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోడం రైతులను నిరాశ పరిచింది. బుధవారం శాసనసభలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై జిల్లా నేతల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని అధికార పక్షం అంటుండగా.. అంకెలగారడీ తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు.

సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి భారీగా నిధులు కేటాయించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించారు. ఈ లెక్కన జిల్లాకు 14వేల ఇళ్లు మంజూరు కానున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున జిల్లాకు రూ.700 కోట్ల నిధులు రానున్నాయి. అలాగే 1.30లక్షల మందికి గృహజ్యోతి పథకం అందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని 22 గురుకులాలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. అయితే బీసీల సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించారని ఆ సంఘం నేతలు పెదవి విరుస్తున్నారు.

బడ్జెట్ బ్రహ్మాండంగా ఉంది



గతంలో ఎప్పుడూలేనంతగా ఈ బడ్జెట్ బ్రహ్మాండంగా ఉంది. ముఖ్యంగా కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పడం జిల్లాకు శుభ పరిణామం. అన్ని వర్గాల ప్రజలకు, అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు, వ్యవసాయం, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారు.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

అంకెలగారడీ



కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయింపులు భారీగా చూపి అంకెలగారడీ చేసింది. వాస్తవంలో ఖర్చు కనిపించడంలేదు. బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల ఊసేలేదు. ఇచ్చిన హామీల్లో సగానికి కూడా నిధులు కేటాయించలేదు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి నిధుల కేటాయించలేదు.

– మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే, వికారాబాద్

బీసీలకు తీరని అన్యాయం



కాంగ్రెస్ చెప్పిన బీసీ డిక్లరేషన్ ఏమైంది.? బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు తీరని అన్యాయం చేశారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీల సంక్షేమానికి కేవలం రూ.11 వేల కోట్లు కేటాయించడం దారుణం. సీఎం, స్పీకర్ తోపాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నా జిల్లాకు ప్రయోజనం చేకూరలేదు.

– ముకుంద్ నాగేశ్వర్, జేఏసీ జిల్లా చైర్మన్

అట్టడుగున తలసరి!

- రూ.10.55 లక్షల ఆదాయంతో రంగారెడ్డి టాప్
- అత్యల్పంగా వికారాబాద్ జిల్లా



2023-24 సంవత్సర తలసరి ఆదాయం	
రంగారెడ్డి	రూ.10,55,913
హైదరాబాద్	రూ.5,54,105
సంగారెడ్డి	రూ.3,45,478
మేడ్చల్–మల్కాజ్‌గిరి	రూ.3,43,130
వికారాబాద్	రూ.1,98,40

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వనరుల లభ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధితో తలసరి ఆదాయంలో జిల్లా తొలి స్థానంలో నిలిచింది. రాష్ట్ర తలసరి ఆదాయం సగటున రూ.3,46,457 ఉండగా.. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల తలసరి ఆదాయం ఎక్కువగా ఉంది. సామాజిక ఆర్థిక సర్వే–2025 ప్రకారం 2023–24 సంవత్సరానికి అత్యధిక తలసరి ఆదాయం రంగారెడ్డిలో ఉండగా అత్యల్పంగా వికారాబాద్ నిలిచింది.

గ్రేటర్ చుట్టూ..

గ్రేటర్ చుట్టపక్కల ప్రాంతాల్లో సంపద, ఆర్థిక అవకాశాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఆయా జిల్లాలు బలమైన పారిశ్రామిక, ఐటీ, సేవా రంగాల వృద్ధి నుంచి ప్రయోజనం పొందుతాయి. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండడంతో అధిక ఆదాయ స్థాయిలను కలిగిఉన్నాయి. తలసరి ఆదాయం అనేది ఒక జిల్లాలోని వ్యక్తుల సగటు ఆదాయం. ఇది జిల్లా ఆర్థిక ప్రగతిని సూచిస్తుంది. అభివృద్ధి కొన్ని పట్టణ జిల్లాల వైపు ఎక్కువగా కేంద్రీకృతమై ఉంది. ఆర్థిక ప్రయోజనాలు సమానం పంపిణీ చేయడంలో వైఫల్యం వల్లే కొన్ని జిల్లాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉంది.

జీడీపీలో రంగారెడ్డి హవా

స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జీడీపీ) వ్యవసాయం, తయారీ, సేవలు, నిర్మాణం ఇతర పరిశ్రమలతో సహా జిల్లాలో ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల విలువలను సూచిస్తుంది. ప్రస్తుత ధరల ప్రకారం జీడీడీపీలో గ్రేటర్ హైదరాబాద్ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. రాష్ట్రంలో అత్యధికం జీడీడీపీ రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. రంగారెడ్డిలో జీడీడీపీ రూ.3,17,898 కోట్లుగా ఉండగా.. హైదరాబాద్‌లో రూ.2,57,949 కోట్లు,మేడ్చల్–మల్కాజ్‌గిరిలో రూ.1,04,710 కోట్లుగా ఉంది. ఆర్థిక కార్యకలాపాలు హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఎక్కువగా కేంద్రీకృతమై ఉండటమే ఈ వృద్ధి కొనసాగింపునకు ప్రధాన కారణం.

ఉత్తర, దక్షిణ భాగాలుగా 'ట్రిపుల్ ఆర్'

హైదరాబాద్‌లో రద్దీని తగ్గించడంతో పాటు ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు రీజినల్ రింగ్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ట్రిపుల్ ఆర్ పరిసర ప్రాంతాలలో ఆర్థికంగా వృద్ధి చెందుతాయి. ఇప్పటికే హైదరాబాద్‌కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 50–60 కి.మీ. దూరంలో ట్రిపుల్ ఆర్ రానుంది. మొత్తం 361.52 కి.మీ. పొడవు ఉండే ట్రిపుల్ ఆర్‌ను ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా అభివృద్ధి చేయనున్నారు.



బొంరెడ్డిపల్లిలో మట్టిని శుద్ధి చేసి ఇసుక తయారీ

యథేచ్ఛగా ఫిల్టర్ ఇసుక దందా

- మట్టిని శుద్ధి చేసి ఇసుకను తయారు చేస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు శాఖలు

పరిగి: నియోజకవర్గంలో రోజురోజుకూ నిర్మాణాలు పెరుగుతుండటంతో ఇసుకకు భారీ డిమాండ్ ఏర్పడింది. ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇల్లు కట్టాలన్నా.. పరిశ్రమలు నెలకొల్పాలన్నా ఇసుక తప్పనిసరి. ప్రభుత్వ అనుమతితో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఇసుకను కొనుగోలు చేయాలంటే లక్షల్లో ఖర్చు అవుతుంది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఫిల్టర్ ఇసుక కొనుగోలుపై దృష్టి సారించారు. వాగులు, నదుల నుంచి సహజ సిద్ధంగా లభించే ఇసుక స్థానంలో ఫిల్టర్ ఇసుకను వాడుతున్నారు. కొంతమంది అక్రమార్కులు ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. పరిగి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. కుల్కచర్ల, దోమ, పరిగి మండలాల్లో ఇసుక వ్యాపారం జోరుగా నడుస్తోంది. పరిగి పట్టణంతోపాటు ఇతర ప్రాంతాలకు బొంరాస్‌పేట్, యాలాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ విషయం పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రాత్రి వేళ జోరుగా రవాణా

కొందరు అక్రమార్కులు ఇసుక అక్రమ దందాతో జేబులు నింపుకొంటున్నారు. పరిగి పట్టణంలో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. అధికార పార్టీకి చెందిన కొందరు టిప్పర్లను కొనుగోలు చేసి బొంరాస్‌పేట, యాలాల, తాండూరు వాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళ ఇసుకను తరలిస్తున్నట్లు తెలిసింది.


గ్రామీణ ప్రాంతాల్లో..

గ్రామీణ ప్రాంతాల్లో ఫిల్టర్ ఇసుక దందా జోరుగా సాగుతోంది. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఫిల్టర్ ఇసుక కేంద్రాలను ఏర్పాటు చేశారు. మట్టిని శుద్ధి చేసి ఇసుకను తయారు చేయాలంటే నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. దీంతో నీటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. మట్టిని శుద్ధి చేయడం ద్వారా వచ్చే ఇసుకను నిర్మాణాల్లో చేపడితే పటిష్టత ఉండదని నిపుణులు అంటున్నారు. ఇవేవీ పట్టించుకోకుండా కొందరు ఫిల్టర్ ఇసుక తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

మచ్చుకు కొన్ని..

- కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఫిల్టర్ ఇసుకను ఎక్కువగా తయారు చేస్తున్నారు.
- పరిగి పట్టణానికి చెందిన కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా పక్క మండలాల్లోని వాగుల నుంచి ఇసుక తెచ్చి విక్రయిస్తున్నారు.
- కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లిలో ఫిల్టర్ ఇసుక జోరుగా సాగుతోంది. గ్రామ సమీపంలో ఫిల్టర్ ఇసుక కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిత్యం భారీగా విక్రయిస్తున్నారు. కుల్కచర్ల, దోమ మండలాలకు ఇక్కడి నుంచి ఫిల్టర్ ఇసుక సరఫరా అవుతోంది.
- గండిచెరువు, పుట్టపహాడ్, అనంత సాగర్, చాపలగూడెం, లాల్‌సింగ్ తండా, ఈర్లవాగుతండా, కుస్మసముద్రం, అంతారం గ్రామాల్లో ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేశారు.
- చౌడాపూర్ మండలం పాచ్యాప్‌తండా, చౌడాపూర్, వీరాపూర్, హనుమయ్యపల్లి, విఠాలాపూర్, లింగంపల్లి గ్రామాల్లో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది.
- దోమ మండలంలో దిర్సంపల్లి, దోర్నాల్‌పల్లి, బడెంపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో ఫిల్టర్ ఇసుక దందా యథేచ్ఛగా జరుగుతోంది.
- కుల్కచర్లలో రాత్రి 11గంటల నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



అనుమతులు లేకుండా ఇసుక తరలించినా.. మట్టిని శుద్ధి చేసి ఇసుకను తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తాం. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగినా, ఫిల్టర్ ఇసుక తయారు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, సీఐ, పరిగి

విద్యార్థీ.. విజయీభవ

రేపటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు

- ఐదు నిమిషాలలోపు ఆలస్యానికి అనుమతి
- జిల్లాలో మొత్తం విద్యార్థులు 12,903మంది
- పరీక్ష కేంద్రాలు 69
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



తాండూరు రూరల్: పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నెంబర్లు వేశారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. పరీక్షలు జరిగే సమయాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు, బెంచీలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 12,903మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 6,450 మంది బాలురు, 6,453 మంది బాలికలు ఉన్నారు. 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అనుకోని పరిస్థితులు ఎదురై ఐదు నిమిషాల లోపు(9.35 గంటలు) ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా..

గతంలో ఎన్నడూ లేని విధంగా కాపీయింగ్ కట్టడికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే ఇన్విజిలేటర్లను బాధ్యులను చేయాలని నిర్ణయం తీసుకున్నారు. గత సంఘటనలు పునరావృతం కాకుండా కలెక్టర్ పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల పర్యవేక్షణాధికారులతో నేరుగా సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటివి జరిగితే ఇన్విజిలేటర్లతో పాటు జిల్లా, మండల స్థాయి విద్యాధికారులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డీఈఓ రేణుకా దేవితోపాటు 69 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది తహసీల్దార్లు, 20 మంది ఎంపీడీఓలు, 20 మంది ఎంఈఓలు పరీక్షలను పర్యవేక్షించనున్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు అందాయి.

కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

తాండూరు రూరల్: పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌కుమార్ ఆదేశించారు. బుధవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో తాండూరు పట్టణంలోని నంబర్ వన్‌పాఠశాలలో మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించిన ఇద్దరు ఉద్యోగులపై వేటు పడిన విషయాన్ని గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించరాదని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ఏమైనా సంఘటనలు జరిగితే చీఫ్ సూపరింటెండెంట్లదే బాధ్యత అని స్పష్టం చేశారు.

అప్రమత్తంగా ఉండండి: డీఈఓ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఉపాధ్యాయులను బాధ్యులను చేసి ఉద్యోగం నుంచి తొలగించేందుకు కూడా ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ సీఐ సంతోష్‌కుమార్, తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, ఎస్ఐలు శంకర్, గిరి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులకు చాలెంజ్

పదో తరగతి పరీక్షలు జిల్లా విద్యాశాఖ తోపాటు ఉన్నతాధికారులకు చాలెంజ్‌గా మారింది. గతేడాది పది ఫలితాల్లో జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ సారి ఆ అపఖ్యాతి నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆల్‌దబెస్ట్



ముందుగా పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులందరికీ ఆల్‌దబెస్ట్. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మౌలిక వసతులు కల్పించాం. ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పటిష్ట ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలి. మంచి ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తేవాలి.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్

ప్రతిఒక్కరూ సహకరించాలి



పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. కేంద్రాలకు వచ్చే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తినా.. ఇతర అసౌర్యాలు కలిగినా వెంటనే డయల్ 100కు కాల్ చేయాలి. పరీక్షలు జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. పరీక్షలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. విద్యార్థులందరికీ బెస్ట్‌ఆఫ్‌లక్

– నారాయణరెడ్డి, ఎస్పీ

'ఆహార భద్రత'కు భంగం కలిగిస్తే చర్యలు

- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, కమిషన్ సభ్యులు

కడ్తాల్: ఆహార భద్రత హక్కుకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఓ రేషన్ దుకాణంతో పాటు, అంగన్వాడీ కేంద్రం, బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, కేజీబీవీ, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలను ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, గోవర్ధన్ రెడ్డి, జ్యోతి, అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలోని రేషన్‌షాపును తనిఖీలు చేపట్టారు. అంత్యోదయ కార్డు లబ్ధిదారులకు పంచదార అందించడం లేదని తెలుసుకున్నారు. దీనిపై 30 రోజుల్లో కమిషన్‌కు నివేదిక అందించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రేషన్ షాపుల వద్ద ఫిర్యాదు బాక్స్, స్టాక్ వివరాలు, సంబంధిత పౌర సరఫరా శాఖ అధికారుల ఫోన్ నంబర్ల వివరాలు ఖచ్చితంగా పెట్టాలని కమిషన్ బృందం ఆదేశించింది. అనంతరం అంగన్వాడీ కేంద్రం –2, 4 కేంద్రాలను సందర్శించి చిన్నారులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం నిల్వలను, రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న గుడ్డు పరిమాణం తక్కువగా ఉందని.. ఏజెన్సీకి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.

క్లుప్తంగా

వెలగని వీధి దీపాలు



సాయిరాం కాలనీలో వెలగని వీధి దీపాలు

పరిగి: పట్టణ కేంద్రంలోని సాయిరాం కాలనీలో కొంత కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. కాలనీలో షిర్డీ సాయిబాబా దేవాలయం ఉండటంతో రాత్రి వేళలో పూజలు నిర్వహించేందుకు భక్తులు వస్తుంటారు. దీపాలు పనిచేయకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. పలు స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికులు లేబర్‌కార్డు పొందాలి



లేబర్‌కార్డులు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

దౌల్తాబాద్: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు లేబర్‌కార్డు పొందాలని అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని చల్లాపూర్ గ్రామంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులకు లేబర్‌కార్డులు అందించారు. లేబర్‌కార్డు వల్ల కార్మికులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. ఒకవేళ లేబర్‌కార్డు కలిగి అనారోగ్యం మృతిచెందితే ప్రభుత్వం రూ.1.30లక్షలు పరిహారం అందిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6.30లక్షలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి పులిందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భయాందోళనకు గురికావొద్దు



విద్యార్థులకు ప్యాడ్లు అందిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్ రూరల్: విద్యార్థులకు రుచికరమైన, మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్‌లో ఉన్న ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర విద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించారు. ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం వంట గది, భోజనశాల, సరుకుల గది తదితర వాటిని పరిశీలించారు. భోజనశాలలో శుచి శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్‌తో పోలీసులు

దోమ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం మండల పరిధిలోని దాదాపూర్ గ్రామ నుంచి ఓ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి సీఐ అన్వర్‌పాషా అడ్డుకున్నారు. సంబంధించిన ధ్రువ పత్రాలను డ్రైవర్‌ను అడగ్గా.. లేవని సమాధానం చెప్పడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడ అక్రమంగా వ్యాపారం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వాగతం



ఫుడ్ కమిషన్ సభ్యులకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్‌కు వచ్చిన తెలంగాణ ఫుడ్ కమిషన్ బృందానికి కలెక్టర్ నారాయణరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ అధికారులతో కమిషన్ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అమలుపై సమీక్షించి, సంతృప్తి వ్యక్తంచేశారు.

వరద కాలువ మాయం

కాసులు దండుకోవడమే ధ్యేయంగా ఎంచుకున్న అక్రమార్కులు జల వనరులను సైతం వదలడం లేదు. దీన్ని కట్టడి చేయాల్సిన అధికార యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మిన్నకుంటున్నారు. ఇదీ మొయినాబాద్ మున్సిపాలిటీలో నెలకొన్న పరిస్థితి.

- చదును చేసి వెంచర్‌లో కలుపుకొన్న రియల్టర్లు
- సురంగల్ పెద్ద చెరువుకు వచ్చే నీటికి అడ్డుకట్ట
- అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మూడు రెవెన్యూ గ్రామాల పొలిమేరలో పూడ్చిన వరద కాలువ

మొయినాబాద్: చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షించేందుకు ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చింది. కానీ కొంతమంది రియల్టర్లు వాటిని లెక్క చేయకుండా యథేచ్ఛగా వరద కాలువ కబ్జాకు పాల్పడుతున్నారు. తాము చేసే అక్రమ వెంచర్లకు ఏది అడ్డు వచ్చినా దాన్ని నామరూపాల్లేకుండా చేసేందుకు వెనుకాడడం లేదు. తాజాగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ పెద్ద చెరువులోకి వరద నీరు తీసుకొచ్చే కాలువను మాయం చేశారు. మూడు గ్రామాల రెవెన్యూ పొలిమేరలో ఉన్న వరద కాలువను జేసీబీలతో పూర్తిగా పూడ్చేసి చదును చేశారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో పరిశీలించిన అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

వరద నీరొస్తే ఎలా?

మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సురంగల్ పెద్ద చెరువులోకి కనకమామిడి, నజీబ్‌నగర్ రెవెన్యూల పొలిమేర నుంచి వరద కాలువ ఉంది. అయితే ఇటీవల కొందరు రియల్ వ్యాపారులు, సురంగల్, కనకమామిడి రెవెన్యూల పరిధిలో కాలువకు ఆనుకుని ఉన్న భూమిని కొనుగోలు చేశారు. అందులో అక్రమ వెంచర్ చేయడానికి జేసీబీతో చదును చేశారు. మూడు రెవెన్యూ గ్రామాల పొలిమేరలో ఉన్న వరద కాలువను వదలకుండా పూర్తిగా పూడ్చేశారు. కాలువను సైతం చదును చేసి తమ భూమిలోనే కలిపేసుకున్నారు. దీంతో వర్షలు కురిసినప్పుడు వరద నీరు ఎలా వెళుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పది రోజుల క్రితమే ఫిర్యాదు

మూడు గ్రామాల పొలిమేర నుంచి ఉన్న వరద కాలువను రియల్టర్లు పూడ్చివేసిన విషయంపై స్థానిక రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు పది రోజుల క్రితమే ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు అధికారులు వెళ్లి పరిశీలించారు. కాలువ పూడ్చినట్లు గుర్తించారు. కానీ ఇప్పటివరకు కాలువ పూడ్చిన రియల్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి ప్రధాన కారణం సదరు స్థిరాస్తి వ్యాపారులకు రాజకీయ అండదండలు ఉండడమేనని ప్రచారం జోరుగా సాగుతోంది. పూడ్చివేసిన వరద కాలువను పునరుద్ధరించకపోతే భవిష్యత్తులో సురంగల్ పెద్ద చెరువులోకి వరద నీరు చేరదని రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



సురంగల్, కనకమామిడి, నజీబ్‌నగర్ రెవెన్యూ పొలిమేరలో నుంచి ఉన్న వరద కాలువను పూడ్చివేసినట్లు ఫిర్యాదు వచ్చింది. వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. కాలువను మళ్లీ తీయించాలని ఆదేశించాం. కాలువ పూడ్చినవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం

అనంతగిరి: పద్దెనిమిది ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ నమోదు, మార్పులు చేర్పులు, బూతు స్థాయి ఏజెంట్ల నియామకం, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చుల సమర్పణ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో ఓటు ప్రాముఖ్యతను కలిగి ఉండేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 నింపి నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అన్నారు. మీసేవ, ఆన్‌లైన్, హెల్ప్‌లైన్, మొబైల్‌లతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫారం 7తో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని అదేవిధంగా ఫారం 8తో ఓటరు బదిలీ, పోలింగ్ కేంద్రం బదిలీ, కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రానికి మార్చుకోవడం ఉంటుందన్నారు. బూతు స్థాయి ఏజెంట్ల నియామకం వారం రోజుల్లోగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆయన సూచించారు. జాబితాలను పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్‌ఓల మొబైల్ నంబర్‌తో సహా తహసీల్దార్లకు లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి జిల్లా పార్టీల అధ్యక్షుల సంతకాలతో సమర్పించాలని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమత్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ ఉష్యానాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జన రంజక బడ్జెట్



ధారూరు: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉంది. ప్రజల సంక్షేమం, అన్ని రంగాలకు ప్రభుత్వం సముచిత న్యాయం చేసింది. అభివృద్ధిని ఎక్కడా విస్మరించకుండా అన్ని శాఖలకు బడ్జెట్ కేటాయించారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నాం చేసింది. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారు.

– రఘువీరారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి

చిరకాల స్వప్నం నెరవేరబోతుంది

పరిగి: ఈ ప్రాంతవాసుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. బడ్జెట్‌లో కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయం. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తప్పకుండా ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పాం. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి ఈ ప్రాంతవాసులకు పట్టించుకోలేదు. ప్రాజెక్టును నిర్మించాలని కోట్లాడినా స్పందించలేదు.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

రైతులకు రుణాలందించండి

- ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు కృషి చేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వాటిని ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ ద్వారా రుణాలు అందించాలన్నారు. యాసంగి, వానాకాలం సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, రానున్న సీజన్‌లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు సకాలంలో అందించాలని తెలిపారు. పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని తెలిపారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలన్నారు. సబ్సిడీ రుణాలు పంపిణీలో జాప్యం చేయవద్దన్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు యూనిట్ల గ్రౌండింగ్‌లో జాప్యం జరుగుతుందని చెప్పగా కలెక్టర్ స్పందించి వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకర్లు పాల్గొన్నారు.

ముగ్గురి బైండోవర్

మోమిన్‌పేట: మండల తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గురిని బైండోవర్ చేసినట్లు బుధవారం తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. గతంలో సారా కాస్తున్న లచ్చానాయక్ తండాకు చెందిన మేఘవత్ ప్రభు, మేఘవత్ బుజ్జిబాయి, మేఘవత్ ఫకీరలను బైండోవర్ చేశామన్నారు. ఎలాంటి ప్రభుత్వ నిషేధిత వస్తువుల జోలికి వెళ్లకూడదని ఆయన సూచించారు.

వాగులో ఇరుక్కుని జింక మృతి



తేలియాడుతున్న జింక కళేబరం

ధారూరు: మండే ఎండలకు దాహార్తికి గురైన చుక్కల జింక వాగులోకి వెళ్లి నీటమునిగి మృతి చెందింది. ఈ మేరకు కళేబరాన్ని బుధవారం ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ధారూరు ఫారెస్టు రేంజర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గట్టెపల్లి–అల్లాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగులో నీటిని తాగేందుకు చుక్కల జింక దిగింది. లోతు ఎక్కువ ఉండటం, బురద నేల కావడంతో ఇరుక్కుపోయింది. దీంతో ఊపిరాడక మృతి చెందింది. నాలుగు రోజుల తర్వాత జింక కళేబరం నీటిపై తేలడంతో, చేపలు పట్టేందుకు వెళ్లిన పెద్దేముల్ మండలం మారెపల్లితండాకు చెందిన వార్యా శ్రీనివాస్‌కు కన్పించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా రేంజర్ రాజేందర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి జింక కళేబరాన్ని బయటకు తీయించారు. కుళ్లిపోయి ఉండటంతో 4 రోజుల క్రితం మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. జింక కళేబరాన్ని పోస్టుమార్టం చేయించి పక్కనే పూడ్చి పెట్టినట్లు రేంజర్ తెలిపారు.

35 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు



యాలాల: రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు

యాలాల: జిల్లాలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్థానిక పోలీసులతో కలిసి బుధవారం జరిపిన దాడుల్లో వేర్వేరు ప్రాంతాల్లో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. వివరాలిలా ఉన్నాయి. అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు యాలాల మండలంలోని ఇందిరమ్మ కాలనీలో స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన మహేష్‌చంద్ర అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని కొంటూ వ్యాపారం చేస్తుంటాడు. కాగా భారీగా పీడీఎస్ బియ్యాన్ని ఓ ప్రదేశంలో నిల్వ ఉంచారనే సమాచారంతో పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో 29 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి, ఆటోను యాలాల పీఎస్‌కు తరలించినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ గణపతి తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో ఘటన..

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని మండల పరిధిలో టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన సంగమేశ్వర్ ఇంటి వద్ద 6 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

మెరుగైన వైద్యం అందించండి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్
- జినుగుర్తి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



జినుగుర్తి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

తాండూరు రూరల్: ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ సూచించారు. బుధవారం సాయంత్రం మండలంలోని జినుగుర్తి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఇన్ పేషంట్, లాబరేటరీ, ఔట్ పేషంట్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. పీహెచ్‌సీలో అన్ని రకాల రక్త పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అందుకు లైట్లు, ఫ్యాన్లు సమకుర్చుకోవాలని సూచించారు.

బీసీ హాస్టల్ పరిశీలన

అనంతరం తాండూరు పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న బీసీ హాస్టల్‌ను అడిషనల్ కలెక్టర్ సుధీర్ తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని చిన్నారులకు సూచించారు. చదువు ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీశైలం, పట్టణ ఆర్ఐ అశోక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

యువ ఇంజనీర్ దుర్మరణం

- గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలు
- విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఘటన



హర్షవర్ధన్‌రెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న మృతిచెందాడు. శంకర్‌పల్లి పట్టణ శివారులో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిల్లిగుండ్లకు చెందిన గోవర్ధన్‌రెడ్డి, సుధ దంపతులకు హర్షవర్ధన్‌రెడ్డి(30), ధ్రువతేజరెడ్డి సంతానం. శంకర్‌పల్లి శివారులో నిర్మిస్తున్న సుభిషి కన్‌స్ట్రక్షన్స్‌లో హర్షవర్ధన్‌రెడ్డి సైట్ ఇంజనీర్‌గా, ధ్రువతేజరెడ్డి సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విధులు ముగించుకున్న హర్ష తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి దాటిన తర్వాత.. వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అదుపు తప్పిన బైక్ వేగంగా వెళ్లి డివైడర్‌ను తాకింది. దీంతో హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన తోటి ఉద్యోగులు అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: మనస్తాపానికి గురైన వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామానికి చెందిన సంద శ్రీనివాస్(32) డ్రైవర్‌గా పని చేస్తూ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలం క్రితం అతడి తల్లిదండ్రులు మృతి చెందారు. దీంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఎవరూ లేకపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలను తెలుసుకొని బంధువులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్టేషన్ మాస్టర్ అబుదేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

‘ఫ్యూచర్’లో విలీనానికి ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న రఘుపతి

మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయడానికి అన్ని వర్గాల ప్రజలతో ఉద్యమిస్తామని జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని విలీనం చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మహా నగరం చేస్తామని గతంలో సీఎం ఎన్నో సార్లు చెప్పారని గుర్తు చేశారు. దీనిపై ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్‌రెడ్డిలను కలిసి తమ సమస్యను విన్నవిస్తామన్నారు. ఈ నెల 21న మండల పరిధిలోని అమీర్‌పేట్ పద్మావతి ఫంక్షన్ హాలులో ఫ్యూచర్ సిటీ జేఏసీ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మనోహర్, సభ్యులు మల్లేష్ యాదవ్, అంధ్యానాయక్, ఈశ్వర్‌ముదిరాజ్, సుదర్శన్‌యాదవ్, యాదయ్య, కృష్ణానాయక్, పాండునాయక్, దత్తునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ అనుచిత ప్రవర్తన

- సిగరెట్ తాగొద్దని చెప్పినందుకు ప్రయాణికుడిపై దుర్భాషలు
- ట్విట్టర్‌లో పోస్టుతో స్పందించిన బస్ భవన్ అధికారులు

ఇబ్రహీంపట్నం: పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్‌కు ఆర్టీసీ బస్సులో చేదు అనుభవం ఎదురైంది. బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు సిగరెట్ తాగొద్దని సూచించడంతో ఆయన పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. ఈ ఘటన బుధవారం ఇబ్రహీంపట్నం వద్ద చోటు చేసుకుంది. ఎంజీబీఎస్ నుంచి మాల్యాపురం వెళ్తున్న హైదరాబాద్ డిపో–1కు చెందిన ఆర్టీసీ బస్సులో ఇబ్రహీంపట్నం వద్ద రఘునందన్ ఎక్కారు. కొద్దిదూరం వెళ్లిన అనంతరం డ్రైవర్ సిగరెట్ తాగడాన్ని గమనించి, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. దీంతో డ్రైవర్ ఆయనను దుర్భాషలాడారు. ఈ ఉదంతాన్ని వివరిస్తూ.. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఎక్స్(ట్విటర్) ద్వారా రఘునందన్ కోరారు. దీనిపై స్పందించిన బస్ భవన్ అధికారులు.. ఆయనకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణ చెప్పడంతో పాటు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు.

కనుల పండువగా రథోత్సవం



పల్లకీ సేవలో భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు గోపాలాచార్యులు, రామాచార్యులు, రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తుల కోలాహలం నడుమ రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, ఈఓ స్నేహలత, మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం సరికాదు

షాబాద్: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లిండంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని మన్‌మర్రిలో ఆయన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలో పనులు చేస్తున్న కూలీలకు కూలీ గిట్టుబాటు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 200 రోజులు పనులు కల్పించి రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, పనులు చేయడానికి సామగ్రి, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. మండల కార్యదర్శి ఎస్.జంగయ్య, నర్సింలు ఉన్నారు.